
వేల్పూర్‌లో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి


రుద్రూర్ ఫుడ్ సైన్స్ కళాశాలలో విద్యార్థులు



పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీసు అధికారులు, సిబ్బంది

# గాంధీజీకి ఘననివాళి

నమస్తే తెలంగాణ యంత్రాంగం, అక్టోబర్ 2 : జిల్లావ్యాప్తంగా గాంధీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో, గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులతోపాటు వివిధ సంఘాల నాయకులు గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాత్మా గాంధీ శాంతి, అహింసా, సత్యం గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పారని వక్తలు కొనియాడారు. వేల్పూర్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. పలు చోట్ల దివంగత ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.


నడిపల్లి మేజర్ జీపీ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది


జీజీహెచ్‌లో సూపరింటెండెంట్, వైద్యులు, సిబ్బంది


జక్రాన్‌పల్లిలో నాయకులు..


ధర్పల్లిలో నివాళులర్పిస్తున్న ఎంపీడీవో బాలకృష్ణ, సిబ్బంది


పొతంగల్ జీపీ కార్యాలయంలో అధికారులు సిబ్బంది..


మాక్లూర్ మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ట్రైనీ ఐఏఎస్ సాంకేతకుమార్


ఆర్మూర్ పట్టణంలో నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


భీమ్‌గల్‌లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అధికారులు, నాయకులు


మోర్తాడ్ జీపీలో నివాళులర్పిస్తున్న ఎంపీడీవో


జిల్లా కేంద్రంలో న్యాయవాదులు..


కోటగిరి ఏఎంసీ కార్యాలయంలో..


మోస్రాలో నాయకులు


నాళేశ్వర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు


బోధన్ గాంధీ పార్క్‌లో గాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు అధికారులు, ప్రజాప్రతినిధుల నివాళులు

## చెరువులో గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు

**బోధన్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో పనులు**

శక్కర్‌నగర్, అక్టోబర్ 2: బోధన్ పట్టణ శివారులోని అతి పురాతన పాండు చెరువు, చెక్కి చెరువుల్లో బుధవారం స్థానిక బోధన్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పట్టణంలో బతుకమ్మ సంబురాల్లో ఇబ్బంది కలుగకుండా చెరువులో పెరిగిన పిచ్చిమొక్కలతో పాటు గుర్రపు డెక్కను తొలగించేందుకు మందును పిచికారీ చేశారు. ఈ చెరువుల్లో గుర్రం డెక్క కారణంగా చేపలు పట్టేందుకు కూడా ఇబ్బందికరంగా మారిందని గంగపుత్రులు పేర్కొన్నారు. ఇప్పటి వరకు గుర్రం డెక్కను తొలగించడంతో పాటు చెరువుల్లో పరిశుభ్రత కోసం లక్షల రూపాయలు వెచ్చించామని బోధన్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు కోట అబ్బయ్య తెలిపారు. బుధవారం కూడా సుమారు రూ. 50వేల విలువైన మందులను పిచికారీ చేయించామని అన్నారు. కార్యక్రమంలో కోట అబ్బయ్య, మాగిరి గంగాధర్, ఒంటిజడ భూమయ్య, తోకల శంకర్, వెండి లక్ష్మణ్, కుల పెద్దలు, గంగపుత్రులు పాల్గొన్నారు.


బోధన్‌లోని పాండు చెరువులో మందును పిచికారీ చేస్తున్న గంగపుత్రులు

## స్వచ్ఛతా ర్యాలీ

డిచ్‌పల్లి/ మోస్రా (చందూర్)/ ఆర్మూర్‌టౌన్/మోర్తాడ్/రెంజల్, అక్టోబర్ 2 : ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ – డిచ్‌పల్లి ఆధ్వర్యంలో గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఈటీఐ నుంచి డిచ్‌పల్లి బస్టాండ్ వరకు స్వచ్ఛభారత్ నినాదాలు చేస్తూ ర్యాలీ తీశారు. అనంతరం బస్టాండ్, శివాలయ ఆవరణలో పిచ్చిమొక్కలను, చెత్తచెదారాలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్, సిబ్బంది భాగ్యలక్ష్మి, రామకృష్ణ, నవీన్, లక్ష్మణ్, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు. చందూర్ మండలకేంద్రంలో ఎంపీడీవో నీలావతి ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు స్వచ్ఛందంగా ప్లాస్టిక్‌ను వాడకుండా నిషేధించాలని మున్సిపల్ కమిషనర్ రాజు, చైర్‌పర్సన్ లావణ్య అన్నారు. స్వచ్ఛతా హీ సేవా ముగింపు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు కాలనీల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు. కమ్మర్‌పల్లిలో ఎంపీడీవో రాజశ్రీనివాస్ , సిబ్బందితో కలిసి శ్రమదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్ని గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా రెంజల్ మండలంలోని బాగేపల్లి గ్రామంలో శ్రమదానం చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో పిచ్చి మొక్కలు తొలగించి, రోడ్లను శుభ్రం చేసినట్లు తెలిపారు. కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


డిచ్‌పల్లిలో స్వచ్ఛతా ర్యాలీలో పాల్గొన్న ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ప్రతినిధులు


కమ్మర్‌పల్లిలో శ్రమదానం చేస్తున్న ఎంపీడీవో


బాగేపల్లిలో రోడ్డు ఊడుస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్, సిబ్బంది

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**డాక్యుమెంట్స్ పోయినవి**

★ నేను ఆర్మూర్ గంగారెడ్డి తండ్రి పేరు ఆర్మూర్ రాజన్న, ఇం. నెం: 1-59/A ,గ్రా & మం|| జక్రాన్‌పల్లి, జి||నిజామాబాద్. నేను తేది.28.09. 2024 నాడు నా యొక్క ఒరిజనల్ రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం:8966/2021,Dt 27-12-2021 ని తీసుకొని బైక్ మీద జక్రాన్‌పల్లి గ్రామం నుండి జక్రాన్‌పల్లి తాండ గ్రామానికి వెళ్లే సమయంలో మార్గమధ్యలో ఎక్కడో పడిపోయిది. కావున దొరికినవారు ఈ నెంబరుకి తెలియజేయగలరు.98480 22837.

NTZ- 334463

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


జిల్లాకేంద్రలోని రోటరీనగర్‌లో ఉన్న అయోధ్య రామమందిర ప్రాంగణంలో బుధవారం ఎంగిలిపూల బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో మేయర్ నీతూకిరణ్ పాల్గొని, స్థానిక మహిళలతో ఆడిపాడారు. – కంఠేశ్వర్, అక్టోబర్ 2

## సీనియర్స్ సిటిజన్స్‌కు సన్మానం



కేపీ శ్రీనివాస్‌రెడ్డి, గుర్రాల సరోజనమ్మను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రతినిధులు

బోధన్, అక్టోబర్ 2: మహాత్మాగాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రి జయంతి రోజును సీనియర్ సిటిజన్స్‌డేగా పాటించిన లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి ప్రతినిధులు ఇద్దరు ప్రముఖ సీనియర్ సిటిజన్స్‌ను సన్మానించారు. పట్టణంలోని శ్రీ విజయసాయి హైస్కూల్‌లో బుధవారం జిల్లా చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు కేపీ శ్రీనివాస్‌రెడ్డిని, సామాజిక సేవకురాలు, రాష్ట్ర ఉత్తమ మహిళా అవార్డు గ్రహీత గుర్రాల సరోజనమ్మను శాలువా, పూలమాలలతో సత్కరించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి అధ్యక్షుడు కె.రామకృష్ణారెడ్డి (థమ్సప్), కార్యదర్శి గణపతిరెడ్డి, విజయసాయి హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణమోహన్, ఆ పాఠశాల మేనేజర్ చక్రవర్తి, క్లబ్ ప్రతినిధులు శ్రీనివాస్‌రావు, వెంకట సుబ్బారావు, దుర్గారావు, పి.గాంధీ, గోపి, ముళ్లపూడి శ్రీనివాస్, నాయిని కృష్ణ, హరిబాబు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

## కబడ్డీ పోటీల్లో సిర్నాపల్లి విజయం

ముప్కాల్, అక్టోబర్ 1: జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ ఒకరోజు కబడ్డీ టోర్నమెంట్‌ను బుధవారం ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర గ్రామీణ క్రీడా ప్రాంగణంలో అండర్-16 బాలుర 55 కిలోల విభాగంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. 14 జట్లు తలపడగా విజేతగా సిర్నాపల్లి జట్టు, రన్నర్‌గా కిసాన్ నగర్ జట్టు నిలిచినట్లు క్రీడల నిర్వాహకులు తెలిపారు. విజేతలకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బహుమతులను ప్రదానం చేశారు. పాల్గొన్న క్రీడాకారుల్లో నుంచి 40 మందిని ఎంపిక చేశామన్నారు. వీరికి ఈనెల 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తామని అన్నారు. కార్యక్రమంలో ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు అంజయ్య, ఫిజికల్ డైరెక్టర్ రాజ్‌కుమార్, పీఈటీలు అనిల్, సంజయ్, ప్రేమ్, గంగామోహన్, అరవింద్, యాదగిరి, సాయిలు, హరీశ్, శ్రీను పాల్గొన్నారు.


విజేత జట్టు సిర్నాపల్లి

## కారోబార్‌ను విధుల్లోకి తీసుకోవాలి


ఎడపల్లి, అక్టోబర్ 2: కారోబార్‌ను విధుల్లోకి తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. మండలంలోని కుర్నాపల్లి గ్రామంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. కొద్దిరోజుల క్రితం కారోబార్ పాండును గ్రామపంచాయతీ కారోబరు విధుల నుంచి ఎందుకు తొలగించారని నాయకుడు రవీందర్ గౌడ్, గ్రామస్తులు గ్రామ కార్యదర్శి రమేశ్‌నాయక్‌ను నిలదీశారు. కొందరు ఉద్దేశ పూర్వకంగా అసత్య ఆరోపణలతో ఎంపీవో మన్మోహన్ శర్మ ద్వారా డీపీవోకు ఫిర్యాదు చేసి కారోబార్‌ను విధుల నుంచి తొలగించారని మండిపడ్డారు. కారోబార్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ గ్రామసభలో తీర్మానించారు. కారోబార్‌ను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఇన్‌చార్జి డీపీవోకు రెండు రోజుల క్రితం లిఖిత పూర్వకంగా వినతి పత్రం అందజేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

## వేల్పూర్ మండలంలో గ్రామసభలు

వేల్పూర్, అక్టోబర్ 2: మండలాల్లోని ఆయా గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సమావేశాలు నిర్వహించారు. ప్రత్యేకాధికారులు గ్రామాల్లో చేపడుతున్న పనుల వివరాలను వివరించారు. సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## డీఎస్సీ జిల్లా టాపర్‌గా గంగాకిశోర్

శక్కనగర్, అక్టోబర్ 2: ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ స్టడీస్‌లో బోధన్‌కు చెందిన నార్ల గంగాకిశోర్ జిల్లా స్థాయిలో టాపర్‌గా నిలిచాడు. ఈ విషయాన్ని సెయింట్ థామస్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌కుమార్ రోడే వెల్లడించారు. సోషల్ స్టడీస్ విభాగంలో జిల్లా స్థాయి టాపర్‌గా నిలవడంతోపాటు ఎస్జీటీలో ఉద్యోగం సాధించారు. రెండు ఉద్యోగాలు సాధించిన సదరు విద్యార్థిని పలు కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు తోఫిక్‌ఖాన్, సుభాష్ అశోక్‌రోడే, శ్రీకాంత్ అభినందించారు.


గంగా కిశోర్

## మున్నూరుకాపు సంఘం ఎన్నిక

రెంజల్, అక్టోబర్ 2: మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం గ్రామ అధ్యక్షుడిగా అమ్రాద్ శేఖర్ బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా సాయన్న, ఉపాధ్యక్షులుగా అర్మూర్‌రెడ్డి, సాయన్న, సంజీవ్, హన్మాండ్లు, కోశాధికారులుగా గణేశ్, లోలపు శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా లోలపు నవీన్, రాజేశ్వర్, సలహాదారులుగా సాయికుమార్, గంగాధర్, తిరుపతి, అనిల్, గంగాధర్, ఆకుల బుజ్జి, గౌరవ అధ్యక్షుడిగా లోలపు సురేశ్, సభ్యులను ఎన్నుకున్నారు.

## నేటి నుంచి జీపీ వాటర్ మెన్లకు శిక్షణ

నవీపేట, అక్టోబర్ 2: ఆయా గ్రామ పంచాయతీల తాగు నీటి సహాయకులు (వాటర్ మెన్)లకు గురువారం నుంచి ఈనెల 7 వరకు యంచ ఫ్లోరైడ్ స్కీం పంపుహౌస్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు యంచ ఫ్లోరైడ్ స్కీం ఏఈ రాము బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిషన్ భగీరథ ఫ్లోరైడ్ స్కీం ద్వారా మండలంలోని 32 గ్రామ పంచాయతీల వాటర్ మెన్లకు నీటి సరఫరాపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రతి వాటర్ మెన్ హాజరు కావాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ పర్యవేక్షణలో శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు తెలిపారు.

## 108 అంబులెన్స్‌లో ప్రసవం

పొతంగల్, అక్టోబర్ 2 : మండలంలోని జల్లాపల్లికి చెందిన గర్భిణి గంగామణి బుధవారం పురిటినొప్పులతో బాధపడుతుండడంతో కుటుంబీకులు 108కు కాల్ చేశారు. గర్భిణిని 108 అంబులెన్సులో బాన్సువాడ ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో పురిటినొప్పులు తీవ్రమై, ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డలు క్షేమంగా ఉన్నారని, మెరుగైన వైద్యం కోసం బాన్సువాడ దవాఖానకు తరలించినట్లు ఈఎంటీ శ్రీకాంత్, పైలెట్ ఖలీంపాషా తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖలీల్‌వాడి, అక్టోబర్ 2 : జిల్లాకేంద్రంలోని పలు డివిజన్ల పరిధిలో నేడు (గురువారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీ తోటరాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంఠేశ్వర్ 11 కేవీ కంఠేశ్వర్ ఫీడర్ పరిధిలోని హైదరాబాద్ రోడ్ బైపాస్, చంద్రశేఖర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## కార్మికుల సేవలు మరువలేనివి

- **మేయర్ నీతూకిరణ్**



కార్మికులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న మేయర్ నీతూకిరణ్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

కంఠేశ్వర్, అక్టోబర్ 2 : మున్సిపల్ కార్మికుల సేవలు మరువలేనివని నగర మేయర్ నీతూకిరణ్ అన్నారు. 15 రోజులుగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఉత్తమ సేవలందించిన కార్మికులు, చెత్త వాహనాలు నడిపే డ్రైవర్లు శానిటేషన్ పర్యవేక్షకులకు గాంధీ జయంతి సందర్భంగా బుధవారం సన్మానించారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణతో కలిసి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మకరంద్, డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్, అదనపు కమిషనర్ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న నిందితుల రిమాండ్

వినాయక్‌నగర్, అక్టోబర్ 2 : నగరంలోని రెండోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన ఇద్దరు నిందితులను బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై యాసిర్ అరాఫత్ వెల్లడించారు. బర్కత్‌పుర కాలనీలో నివాసం ఉండే పాత నేరస్తుడు అఫ్రోజ్‌తోపాటు మునీఫ్‌ఖాన్‌ను పట్టుకొని, వారి నుంచి 100 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మూడు సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. మహారాష్ట్రలోని నాందెడ్ ప్రాంతానికి చెందిన కరీం నుంచి గంజాయిని కొనుగోలు చేసి, వాటిని చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి.. రూ.200 నుంచి 300కు ఒక ప్యాకెట్ చొప్పున నిజామాబాద్ నగరంలో విక్రయిస్తున్నట్లు నిందితులు అంగీకరించారని ఎస్సై వెల్లడించారు.

## దాతకు సన్మానం

ఏర్గట్ల, అక్టోబర్2: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాత బద్దం శ్రీనివాస్‌రెడ్డిని అయ్యప్ప స్వామి సేవా సమితి సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో గురుస్వామి మగ్గడి వెంకటేశ్ గౌడ్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు గుల్లె రాజేశ్వర్, మాజీ ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సున్నపు అంజయ్య, అయ్యప్ప సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పేకాటస్థావరాలపై దాడి

మాక్లూర్, అక్టోబర్ 2: అడవి మామిడిపల్లి, గుత్ప గ్రామశివార్లలో పేకాట స్థావరాలపై బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి జూదరులను పట్టుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మామిడిపల్లి శివారులో పేకాడుతున్న ఐదుగురి నుంచి రూ.52,870 నగదు స్వాధీనం చేసుకున్నామని, గుత్ప శివారులో నలుగురి వద్ద రూ.4,400 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 9 మంది జూదరులను అరెస్ట్ చేసి మాక్లూర్ పోలీసులకు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ సీఐ, పోలీసులు పాల్గొన్నారు.

## ఆయుర్వేద మందుల పంపిణీ


ఆయుర్వేద మందులను అందజేస్తున్న వైద్యుడు

బోధన్ రూరల్, సెప్టెంబర్ 2: మండలంలోని ఎరాజ్‌పల్లి గ్రామంలో బుధవారం దత్తు ఆయుర్వేదం జగన్నాథ్ గోశాల వారి ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద నిపుణుడు గుమ్మడివెల్లి శ్రీనివాస్ వైద్య పరీక్షలు చేసి అవసరం ఉన్న వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

ముప్కాల్, అక్టోబర్ 2: ముప్కాల్ మండలంలోని రెంజర్ల గ్రామానికి చెందిన కార్తన్ జగదీశ్వర్ (60) కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి గురై కాకతీయ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రజనీకాంత్ తెలపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం..కార్తన్ జగదీశ్వర్ మద్యానికి బానిసై తరుచూ భార్యతో గొడవ పడుతుండేవాడు. మంగళవారం భార్యగో గొడవపడి మనస్తాపంతో కాకతీయ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కాలువలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున జగిత్యాల్ జిల్లాలోని మెట్‌పల్లి పట్టణ శివారులోని రైల్వేబ్రిడ్జి సమీపంలో మృతదేహం బుధవారం లభ్యమైంది. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


జగదీశ్వర్ (ఫైల్)

### సంక్షిప్తంగా..

- **చికిత్స పొందుతూ మహిళ మృతి** - వినాయక్‌నగర్, అక్టోబర్ 2 : పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ చికిత్స పొందుతూ మృతిచెందింది. ఫోర్త్ టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని పద్మనగర్ రోడ్ నంబర్-1కు చెందిన కట్ట లలిత (53) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నది. అనారోగ్యంతో మనస్తాపం చెందిన ఆమె గత నెల 27న బాత్‌రూంలో పురుగుల మందు తాగింది. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. మృతురాలి అన్న తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.
- **సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత**- ఆర్మూర్‌టౌన్, అక్టోబర్2: పట్టణానికి చెందిన వైష్ణవికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.రెండు లక్షల చెక్కు మంజూరు కాగా బుధవారం కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి బాధితురాలి కుంటుంబ సభ్యులకు అందజేశారు.